క్లుప్తంగా

ఎస్వీబీసీకి రూ.11లక్షల విరాళం



తిరుపతి అలిపిరి: మహారాష్ట్రకు చెందిన సునీత లఖన్ కుమార్ అగర్వాల్ గురువారం ఎస్వీబీసీ ట్రస్ట్‌కు రూ.11 లక్షల విరాళం ఇచ్చారు. డీడీని ఆయన ప్రతినిధులు రాఘవేంద్ర, బాలసుదర్శన్ రెడ్డి ఎస్వీబీసీ కార్యాలయంలో చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, సీఈవో షణ్ముఖ్ కుమార్‌కు అందజేశారు.

రుయా ల్యాబ్ తనిఖీ

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలోని ల్యాబ్‌ను గురువారం సీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీనాయక్ తనిఖీ చేశారు. అసిస్టెంట్ ఆర్ఎంవో అన్వేష్‌రెడ్డితో కలిసి ల్యాబ్ పనితీరును పరిశీలించారు. రోగులకు అక్కడ చేస్తున్న పరీక్షల సంఖ్య, రికార్డుల నమోదుపై ఆరా తీశారు. పరీక్షల వివరాలను పక్కాగా నమోదు చేయాలని, వైద్యుల సూచనలు ఉంటేనే పరీక్షలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

సీసీరోడ్డుకు భూమిపూజ



చంద్రగిరి: మిట్టపాళెం పంచాయతీ శ్రీనివాస మంగాపురం హరిజనవాడలో గురువారం సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి చొరవతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తుడా నిధుల నుంచి రూ.15 లక్షలు విడుదల చేశారని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి సీసీ రోడ్డు లేకపోవడంతో దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రోడ్డు పూర్తయితే శ్రీనివాసమంగాపురం ఆలయం, జాతీయ రహదారికి వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఉప సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, మాజీ సర్పంచ్ బాలసుబ్రమణ్యం, కాంట్రాక్టర్ సాయి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు గొప్ప త్యాగమూర్తి



పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న సదా భార్గవి



నివాళులర్పిస్తున్న సీఎండీ సంతోషరావు, అధికారులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుకుమార్



నివాళులర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి అర్బన్: అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు గొప్ప త్యాగమూర్తి అని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. కలెక్టర్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే 1956 నవంబర్1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని వెల్లడించారు. ఆయన జ్ఞాపకార్థం రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించిందని, నెల్లూరు జిల్లా పేరును 2008లో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మార్చారని తెలిపారు. యువత మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేసీ డీకే బాలాజీ, జిల్లా బీసీ సంక్షేమ, సాధికార ఇన్‌చార్జి అధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, కలెక్టరేట్ ఏవో జయరాములు తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య కళామందిరంలో..

తిరుపతి కల్చరల్: భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల ఆరాధ్యనీయుడని టీటీడీ జేఈవో సదాభార్గవి కొనియాడారు. అన్నమాచార్య కళామందిరంలో టీటీడీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇతరుల కోసం తమ జీవితాన్ని పణంగా పెట్టి పోరాడేవాడే నాయకుడన్నారు. తిరుపతికి చెందిన డాక్టర్ మన్నవ గంగాధరప్రసాద్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని పలు మార్లు జైలుకు వెళ్లారని తెలిపారు. తెలు గు రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేశారని తెలిపారు. అంతకు ముందు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. టీటీడీ సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో స్నేహలత, అదనపు ఎఫ్ఏసీఏవో రవిప్రసాద్, డెప్యూటీ ఈవో గోవిందరాజన్, డీఈవో భాస్కర్‌రెడ్డి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్లి విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఆర్యవైశ్యులు నివాళి

తిరుపతి కల్చరల్: తెలుగు రాష్ట్ర సాధన కోసం అశువులు బాసిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు అని ఆర్యవైశ్య నేతలు తెలిపారు. వారు రుయా సర్కిల్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, వికాస్, కార్తీక్, శబరీష్, శివకుమార్, జగదీష్ కృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి పొట్టి శ్రీరాములు త్యాగనిరితిని కొనియాడారు. రంగస్థలి కార్యదర్శి కేఎస్.రాజా, కె.సుబ్రమణ్యంరెడ్డి, తిరుమలయ్య, ఆదిస్వామి, వెంకట్రామయ్య, ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు కృషి శ్లాఘనీయం

తిరుపతి రూరల్: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన కృషి శ్లాఘనీయమని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు కొనియాడారు. తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. సీఎండీ సంతోషరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు దీక్ష ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని వివరించారు. సంస్థ ఉద్యోగులు అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో సంస్థ అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. డైరెక్టర్లు ఎస్వీఎస్ సుబ్బరాజు, శివప్రసాదరెడ్డి, వీఎన్ బాబు, చీఫ్ జనరల్ మేనేజర్లు వరకుమార్, లక్ష్మీనరసయ్య, గురవయ్య, జాయింట్ సెక్రటరీ రాధా జయశ్రీ పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: అమరజీవి పొట్టి శ్రీరాములుకు గురువారం ఐతేపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుకుమార్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగు భాషకున్న ప్రాముఖ్యత, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో కలిగే లాభాలను దృష్టిలో ఉంచుకుని ఆయన అహింస పద్ధతిలో పోరాటం చేశారని పేర్కొన్నారు. పొట్టిశ్రీరాములును ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. సెట్విన్ తిరుపతి మేనేజర్ మోహన్ కుమార్ విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ రెడ్డి, హెచ్‌వోడీలు నరసింహారెడ్డి, పి.భక్తవత్సలం పాల్గొన్నారు.

స్విమ్స్ విద్యార్థులకు అవార్డులు

తిరుపతి తుడా: మహారాష్ట్రలోని డాక్టర్ ఎబీజె అబ్దుల్‌కలామ్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీలో ఈనెల 11వ తేదీ వరకునిర్వహించిన జాతీయ సదస్సులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులను ప్రకటించారు. శాస్త్రీయ పోస్టర్ ప్రదర్శనలో తృతీయ బహుమతితోపాటు మరో ఐదు బహుమతులు, వాలీబాల్ క్రీడలో ద్వితీయ, డ్యాన్స్‌లో రెండు, సింగింగ్‌లో ఒకటి, బ్యాడ్మింటన్‌లో మూడు బహుమతులు కైవసం చేసుకున్నట్టు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు.

స్విమ్స్‌లో డయాగ్నసిస్ స్క్రబ్‌పై శిక్షణ

తిరుపతి తుడా : స్విమ్స్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ క్లినికల్ వైరాలజీ విభాగం ఆధ్వర్యంలో గురువారం సిరోలాజికల్ డయాగ్నసిస్ ఆఫ్ స్క్రబ్ టైఫస్ శిక్షణ ఇచ్చారు. స్విమ్స్ డైరెక్టర్ బి.వెంగమ్మ వైద్యరంగంలో డయాగ్నిసిస్ ప్రాధాన్యతను వివరించారు. ఉషాకళావత్, పద్మలత, మాధవ, నాగరాజు, శ్రీకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూమనపై విమర్శలు విడ్డూరం



మాట్లాడుతున్న కట్టా గోపియాదవ్

తిరుపతి కల్చరల్: ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిపై బీజేపీ నేత సామంచి శ్రీనివాస్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కట్టా గోపీయాదవ్ తెలిపారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే నిరంతరం నగర అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే వినాయక సాగర్‌ను అభివృద్ధి చేశారన్న విషయం వినాయక చవితి నిమజ్జన మహోత్సవ కమిటీ సభ్యుడిగా ఉన్న సామంచి శ్రీనివాస్ కళ్లకు కనిపించలేదా అని ప్రశ్నించారు. వినాయక చవితి నిమజ్జనం పేరుతో డబ్బులు వసూలు చేసి పబ్బం గడుపుకునే నీచపు సంస్కృతి ఎవరిదో అందరికీ తెలుసన్నారు. వైఎస్సార్ సీపీ నేత బొమ్మగుంట రవి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలు నిందారోపణలు చేస్తున్నట్టు దుయ్యబట్టారు. చింతా రమేష్ యాదవ్, కృష్ణమూర్తి, బాల సుబ్రమణ్యం, మోహన్‌బాబు యాదవ్, తిరుపతి వడ్డెర సంఘం అధ్యక్షుడు బాలాజీ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో అహోబిలం పీఠాధిపతి





అమ్మవారిని దర్శించుకున్న అహోబిలం పీఠాధిపతి, తిరుమలలో సినీ నటుడు ఉపేంద్ర

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని గురువారం అహోబిలం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ తన శిష్యబృందంతో కలిసి దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా కన్నడ ప్రముఖ సినీ హీరో ఉపేంద్ర తిరుమల శ్రీవారిని, పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఫొటోలు తీసుకున్నారు. కార్యక్రమంలో వీఐ రామ్మోహన్, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో జాతీయ సదస్సు ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి-కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం భౌతిక, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నానో స్ట్రక్చర్డ్ మెటీరియల్స్ టు బ్యాటరీ అండ్ సూపర్ కెపాసిటర్స్(ఎన్ఎంబీఎస్-2023) అన్న అంశంపై జాతీయ స్థాయి సదస్సు ప్రారంభమైంది. ఇందులో ముఖ్యఅతిథులుగా తిరుపతి ఐసర్ రసాయన శాస్త్ర విభాగపు డీన్ ప్రొఫెసర్ విజయమోహన్ కె.పిళ్లై, బెంగళూరులోని రేవ యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగపు ప్రొఫెసర్ డిహెచ్.నాగరాజులు పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న కాలుష్యాన్ని, వనరుల కొరతను నియంత్రించడంలో బ్యాటరీ ఆధారిత వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు కార్బన్ రహిత సమాజాన్ని స్థాపించవచ్చని తెలిపారు. సదస్సులో ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.చంద్రశేఖర్‌రావు, విభాగాధిపతి ఎస్.మనోహర్‌రెడ్డి, కన్వీనర్ పి.బాబు, కోకన్వీనర్ కె.రెడ్డిమోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పాకాల : మండలంలోని చెన్నుగారిపల్లికి చెందిన నూతన వధూవరులు కె.మదన్‌మోహన్, టి.వినీలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని సర్పంచ్ కళావతి, మాజీ జెడ్పీటీసీ పవన్‌కుమార్, నాయకులు లక్ష్మయ్య, రవి రెడ్డి, కార్తీక్ అందజేశారు.

త్వరితగతిన క్రికెట్ స్టేడియం పనులు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: గొల్లవానిగుంట ప్రాంతంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ స్టేడియం పక్కన వెళుతున్న డ్రైనేజీ కాలువను త్వరగా పూర్తి చేయాలన్నారు. క్రీడాకారులకు అవసరమైన గదులు, మరుగుదొడ్లను వెంటనే నిర్మించాలన్నారు. కమిషనర్ వెంట డీఈ గోమతి, ఏఈకామ్ ప్రతినిధులు బాలాజీ, అనిల్, కాంట్రాక్టర్లు ఉన్నారు.

మహిళా వర్సిటీలో ముగిసిన సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని అప్లయిడ్ మైక్రో బయాలజీ విభాగంలో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ మైక్రోబియల్ టెక్నాలజీ అండ్ అలైడ్ సైన్సెస్ అనే అంశంపై రెండు రోజులుగా చేపట్టిన జాతీయ స్థాయి సదస్సు గురువారం ముగిసింది. బయోలాజికల్ ప్రాసెస్ ఫర్ కెఫెన్ డిగ్రిడేషన్‌పై ప్రొఫెసర్ సత్యనారాయణ ఎస్.గుమ్మడి ప్రసంగించారు. ఫైటో కెమికల్ అండ్ దేర్ బయో ఆక్టివిటీ స్పెషల్ రెఫరెన్స్ టు సైన్సెస్‌పై ప్రొఫెసర్ బి.ఆండాలు మాట్లాడారు. సదస్సు ముఖ్య ఉద్దేశాలను ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరి వివరించారు. అనంతరం విద్యార్థినులకు నిర్వహించిన మౌఖిక, పోస్టర్ ప్రదర్శనల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రొఫెసర్లు సువర్ణలతా దేవి, చండీకుమారి, జయమాధురి, వాణి, రుక్మిణి, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

బీసీ సంఘం నూతన కమిటీ ఎంపిక



నియామక పత్రాలు అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా నేతలు

తిరుపతి కల్చరల్: ఏపీ బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడుగా మధు మార్గాచార్య, తిరుపతి నగర ఉపాధ్యక్షులుగా కె.మునిరాజ, మురళీగౌడ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. సంఘం కార్యాలయంలో గురువారం నియామక పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం రాజకీయ పార్టీగా ఆవిర్భవిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో పలువురు సంఘంలో చేరుతున్నారని పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల లోపు జిల్లాలో సంఘం నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

భాషపై మక్కువ పెంచుకోవాలి



విద్యార్థులకు తెలుగు భాషపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో

పాకాల : విద్యార్థులు చిన్నతనం నుంచే తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలని ఎంఈవో బాబ్జీ తెలిపారు. ఆయన గురువారం పోలిశెట్టివారిపల్లి, పత్తిపాటివారిపల్లి, పదిపుట్లబైలు పాఠశాలలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు భాషపై మక్కువ చూపేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి రోజూ ప్రార్థనా సమయంలో వేమన, సుమతి శతకాల్లోని పద్యాలు పిల్లలు చెప్పేలా చూడాలన్నారు. గ్రంథాలయాలకు ప్రభుత్వం అందజేసిన పుస్తకాలను చదివించాలన్నారు. హెచ్ఎంలు రెడ్డెమ్మ, ప్రమీలమ్మ, ఉపాధ్యాయులు వెంకటాచలం, సరితకుమారి, ఆసియా, మోహన్, ఉదయ్‌కుమార్, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రిక్వెస్ట్ స్టాపింగులపై రోజూ రగడ

తిరుపతి అర్బన్: ఆర్టీసీ డ్రైవర్ల దూకుడు ఏ మాత్రం తగ్గడం లేదు. ప్రయాణికులతో వాగ్వాదానికి దిగుతూ ఆర్టీసీ ప్రతిష్టను దిగజారుస్తున్నారు. ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని, దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినా పెడచెవిన పెడుతున్నారు. ప్రధానంగా రాత్రిళ్లు రిక్వెస్ట్ స్టాపింగులపై రగడ కొనసాగుతూనే ఉంది. తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి రూ.65 టికెట్ ఉంది. ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్ లేదా నాన్‌స్టాప్ బస్సుల్లో ఎక్కి తమ అవసరాల నిమిత్తం మార్గమధ్యంలో రేణిగుంట, ఏర్పేడులో దిగడానికి డ్రైవర్‌ను రిక్వెస్ట్ చేసుకుంటున్నా ఒప్పుకోవడం లేదు. వారు బస్సు ఎక్కేటప్పుడు కండక్టర్ నుంచి అనుమతి తీసుకునే ఎక్కుతున్నా ఫలితం లేదు. ఇటీవల తిరుపతి-శ్రీకాళహస్తి రోడ్డులోని తొండమనాడు క్రాస్ వద్ద ప్రయాణికులు, డ్రైవర్ ఒకరిపై ఒకరు దాడికి దిగిన విషయం తెలిసిందే. అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా జిల్లా ఆర్టీసీ పెద్దలు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఐఎఫ్‌టీయూ మహా సభలపై సమావేశం

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో నిర్వహించనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని జాతీయ నేతలు పిలుపునిచ్చారు. మహాసభల నిర్వహణపై గురువారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జాతీయ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం జాతీయ అధ్యక్షురాలు అపర్ణ, ప్రధాన కార్యదర్శి బి.ప్రదీప్, రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ సభ, సమావేశ స్థలాలను పరిశీలించారు. సభ ఏర్పాట్లపై నాయకులతో చర్చించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరిక్రిష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్రమణ్యంతో పాటు అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ నేతలు వెంకటరత్నం, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

చంద్రగిరి: మండలంలోని మల్లయ్యపల్లి వద్ద ఈ నెల 12న కారు చెట్టును ఢీకొని గాయపడిన మహిళ బుధవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మదనపల్లికి చెందిన అమల(30) తన బంధువులతో కలిసి రామచంద్రాపురం మండలంలో జరిగిన వేడుకలో పాల్గొని కారులో చంద్రగిరికి తిరుగు ప్రయాణమయ్యారు. మల్లయ్యపల్లి వద్ద వస్తున్న క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. తలకు తీవ్ర గాయాలైన అమలను తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని గురువారం బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన లారీ



చంద్రగిరి: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలోని కల్‌రోడ్డుపల్లి వద్ద గురువారం ప్రమాదవశాత్తు లారీ కాలువలోకి దూసుకెళ్లింది. పోలీసుల కథనం మేరకు.. లారీ చెన్నై నుంచి కోలార్‌కు నూనె ప్యాకెట్లతో వెళుతోంది. కల్‌రోడ్డుపల్లి వద్ద డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో లారీ రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే వాహనాన్ని అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని లారీని బయటకు తీశారు.